# గణనీయులు

ఒక్కొక్క మనిషిదీ ఒక్కొక్క ప్రత్యేక ప్రపంచం. అందువల్ల ఒక కొత్త వ్యక్తి గురించి తెలుసుకోవడమంటే ఒక అజ్ఞాత ప్రపంచాన్ని 'ఎక్స్‌ప్లోర్' చెయ్యడమే. అయితే ఎదురైన ప్రతి కొత్త మనిషి పైనా 'నీ పేరేమిటి? వయసెంత? ఉద్యోగ మేమిటి? పెళ్ళయిందా?' అంటూ ప్రారంభించి ప్రశ్నల పరంపర కురిపించడం బాగుండదు. దేనికైనా లైసెన్స్ అంటూ ఒక టుండాలి. అలాంటి లైసెన్స్ చాలా కొద్ది మందికి, అదైనా పదేళ్ళ కొకసారి లభిస్తుంది. దాన్ని 'జనాభా వివరాల సేకరణ' అంటారు. అదొక మహాయజ్ఞం లాంటి తతంగం. అందులో పాల్గొనే అవకాశం నాకు మూడుసార్లు లభించింది. అవకాశమనడం కన్నా అదృష్ట మనడం సమంజసంగా ఉంటుందేమో! ఎందుకంటే, నేను - ఆ మాటకొస్తే మీరు కూడా - వెరసి మనమంతా కొన్ని వేల సంవత్సరాల మానవ నాగరికతకు వారసులం. మనుషుల్ని గురించి తెలుసుకోడమంటే, మన నాగరికతను సర్వే చేయడమే గదా!

1961లో నేను ఉద్యోగ రీత్యా పైడిపల్లెలో ఉన్నాను. 71 వచ్చేసరికి బొమ్మగుడికి బదిలీ అయ్యాను. 81కి నా మకాము వనస్థలానికి మారింది. అప్పట్లో నేను స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో ఫస్ట్ అసిస్టెంటుగా పని చేస్తున్నాను.

వనస్థల మంటే అడివిగాదు. అడివికి దరిదాపుల్లో ఉన్న ఒక పేట. ఆ రెవెన్యూ గ్రామాన్ని మూడు భాగాలుగా విభజించి, ముగ్గురు ఎన్యూమరేటర్లను నియమించారు. అడవివైపున ఉన్న శివారు పల్లెలన్నీ నా భాగానికి వచ్చాయి. 'గృహవాస్తు' ను వెక్కిరించినట్టుగా ఎలా వీలయితే అలా చెల్లా చెదరుగా ఉన్న ఇళ్ళు. నిర్మాణ సామగ్రిని బట్టి చూస్తే అవి ఇంకా సిమెంటు యుగంలోకి వచ్చినట్టు లేవు. నివాస గృహాలను బట్టి వాళ్ళని అసలైన మట్టి మనుషులని చెప్పొచ్చు. మనుషులేమో మంచి వాళ్ళేగానీ, సెన్సస్ రికార్డులు చంకలో పెట్టుకుని వెళ్ళి నేను తమ పుట్టు పూర్వోత్తాలనంతా వాకబు చేయబోయేసరికి, వాళ్ళు నన్ను ముమ్మూర్తులా ప్రభుత్వ ప్రతినిధిగా భావించారు.

"మా ఊరికి బోరింగు వేసే దెప్పుడు?"

"బ్యాంకులో లోన్లెందుకు మంజూరు కాలేదు?"

"వాన లొస్తే రాక పోకల్ని అటకాయించే ఏటి పైన బ్రిడ్జి కట్టేదెప్పుడు?" ఇలా రక రకాల ప్రశ్నలతో నా దుంప తెంచేరు.

ప్రజల కొరతల్ని తీర్చదగ్గ స్తోమత నాకు బొత్తిగా లేదనీ, నేను నిరపాయకరమైన బడిపంతుల్ననీ నచ్చజెప్పాక, వాళ్ళెంతో మట్టూ మర్యాదతో నా పనికి సహకరించి; చాలని దానికి పండో, ఫలహారమో, పానకమో ఇప్పించి, సాదరంగా సాగనంపుతూ వచ్చారు. ఇచ్చిన గడువుకింకా కొద్ది రోజులు ముందుగానే ఎన్యూమరేషన్ పని ముగిసింది. ఉండబట్టలేక ఈ ఆనందాన్ని మా హెడ్మాస్టరుగారి దగ్గర వెళ్ళబోసుకున్నాను.

ఆయన కొద్ది రోజుల్లో ఉద్యోగం నుంచి రిటయిరు కాబోతున్నాడు. వనస్థలం ఆయన స్వస్థలం. ఆ ప్రాంతపు విశేషాలన్నీ క్షుణ్ణంగా తెలిసినవాడు. ఒకటి రెండు

క్షణాలాగి ఆయనన్నాడు- 'మంచిదయ్యా మేష్టారూ! నువ్వు నీ పనిని తొందరగా ముగించినందుకు నాకున్నూ ఆనందంగానే ఉంది. కానీ నువ్వు నీ జ్యూరిసిడిక్షనులో కనీసం ఒక్క కుటుంబాన్నయినా వదిలి పెట్టి ఉంటావని నా అనుమానం. అందుకని నేను నిన్ను తప్పు పట్టడానికిన్నీ లేదు. బహుశా ఆ కుటుంబం ఇదివరకు జనాభా రికార్డులలోకిగానీ, వోటర్ల లిస్టులోకిగానీ ఎక్కి ఉండకపోవచ్చు. ఏ ఎన్యూమరేటరైనా ఊళ్ళన్నీ తిరగ్గలడు. అడవిలోకి వెళ్ళే ఓవరికం ఎవరికుంటుంది?"

నాకు మతిపోయినంత పనైంది. "అదేమిటిసార్, అలా అంటున్నారు? మనిషన్నవాడు ఎక్కడున్నాసరే, వాడిపేరు జనాభా చిట్టాలోకి తెచ్చి తీరాలన్నది ప్రభుత్వం వారు మా కిచ్చిన ఉత్తరువు. మనుషులు అడివిలోనే గాదు, సముద్రం నడుమ దీవిలో ఉన్నా సరే - అక్కడికి వెళ్ళి తీరవలసిందే! ఆ కుటుంబం ఎక్కడుందో చెప్పండి, వెళ్ళకపోతే అప్పుడడగండి" అన్నాను.

హెడ్మాస్టరు ద్వారా తెలిసిన వర్తమానాన్ని క్రోడీకరిస్తున్నాను. ఆ కుటుంబం అడివిలో ఉంది. అదెప్పుడూ అడవుల్లోనే ఉంటుంది. అదైనా స్థిరంగా ఒకచోట ఉండదు. ఒకప్పుడు నక్కలబండ పైన ఉంటుంది. మరొకప్పుడు మద్దిమాకుల కోనలో ఉంటుంది. ఇంకొకప్పుడు పావురాళ్ళ మిట్టపైన ఉంటుంది. వేదకాలంనాటి ఆర్యులది సంచార జీవన మెందుకైంది? వాళ్ళ వృత్తి అలాంటిది. వీళ్ళదీ అదే వృత్తి - పశువులు మేపడం. కుటుంబ యజమాని పేరు మల్లేసు. ఆవుల్ని మేపేవాడు గాబట్టి ఆవుల మల్లేసు. అయితే ఒక్క ఆవైనా అతడిస్వంతంగాదు. అన్నీ గ్రామంలోని రైతులవి. ఎల్లప్పుడూ రెండు వందలకు తగ్గకుండా అవి అడివిలోనే ఉంటాయి. పగటి పూట వాటిని మేపడం, రాత్రిపూట కాపలా ఉండడం - మల్లేసు వ్యాసంగం. అతడి కుటుంబ సభ్యులందరూ ఇందులో పాలు పంచుకుంటారు.

మల్లేసు కోసం నా అన్వేషణ మరునాటి ఉదయమే ప్రారంభమైంది అడివిలో బాగా పరిచయమున్న ఓ గ్రామస్థుణ్ణి వెంట బెట్టుకుని బయలుదేరాను. శివారు పల్లెలు దాటి, కొండవాగు మూలంగా ఏర్పడిన డొంక దారిలో రెండు కిలోమీటర్లు నడిచాక ఒక చిట్టడివిలో ప్రవేశించాము. ముందుకు సాగిన కొద్దీ ఆ చిట్టడివి దట్టమైపోతూ వచ్చింది. ఆఖరుకు మా పని అడివి కడుపులో బుడుంగున మునిగిపోయినట్టయింది. పైన ఆకాశం ఒకటి తప్పితే ఎట్టయెదట పదిబారల దూరంలో ఏముందో తెలియరావడం లేదు. దారి చూపిస్తున్న గ్రామస్థుడు ఓ పొడుగాటి చెట్టు పైకెక్కి చిటారు కొమ్మ పైనుంచి చుట్టూరా కలయజూచి, విజయ గర్వంతో క్రిందికి దిగి వచ్చాడు. "ఇంకా ఒక మైలు దూరం నడవాల్సి వచ్చేట్టుంది సార్! అదో, ఆ మూలగా గొడ్లు కదలడం కనిపించింది" అన్నాడు.

ముళ్ళచెట్ల మధ్య నుంచీ, వంగిన వెదురు జొంపాల క్రింద నుంచీ, సెలయేటి నీటి జాలుల్లో నుంచీ, మా సాహస ప్రయాణం మళ్ళీ ఒక గంటసేపటిదాకా కొనసాగిన తర్వాత, ఏటవాలుగా పరుచుకున్న పెద్ద బండ ఒకటి ఎదురైంది. దాని పైన ఆకులలములతో, కొమ్మ రెమ్మలతో గుడారాల్లా వేసుకున్న మూడు గుడిసెలు కనిపించాయి. ఏడెనిమిదేళ్ళకు లోబడిన కుర్రవాళ్ళు కొందరు గోచీలు పెట్టుకుని, తువ్వాళ్ళు చుట్టుకుని బండల పైన ఆడుకుంటున్నాతు. బండల కటు వైపున చదును చేసిన విశాలమైన జాగాచుట్టూ ఎత్తుగా వేసిన ముళ్ళ తొడుగుల ప్రహరీ కనిపిస్తోంది.

అది రాత్రివేళ ఆలమంద విడిది చేయడం కోసమై ఉంటుంది. గుడిసెల ఎదుట బండలు చీలి నేల కనిపిస్తున్న అగ్ని గుండం ఇప్పుడు మండడం లేదు. నిప్పుల్లో నుంచి పొగమాత్రమే పైకొస్తోంది. అడివి మెకాల నుంచి రక్షణ కోసం రాత్రుల్లో దాన్ని నెగడు లాగా మండిస్తారేమోనని నాకు స్ఫురించింది.

ఉన్న వాళ్ళలో ఒక పెద్ద కుర్రవాణ్ణి పట్టుకుని మల్లేసు కోసం వాకబు చేశాను.

"మా తాత కోసర మొస్తిరా? ఉండా దుండాడు. అడివిలో ఉండాడు. పిల్చేదా?" అన్నాడు కుర్రాడు.

పిలవమన్నాను. 'అడివిలో కంటికి కానరాని వ్యక్తిని పిలవడానికేదైనా టెక్నిక్కు ఉందేమో!' అనుకున్నాను అదేం లేదు.

"తాతా, తాతా! నీ కోసం మెవురో వొచ్చినారు" అంటూ ఆ కుర్రవాడు కేక పెట్టాడు. అతడి మాటలు కొండ కోనలో ప్రతిధ్వనించాయి.

నిమిషాలు దొర్లిపోతున్నాయి.

'రావోయీ మల్లేసు! నువ్వు గిరిగహ్వరంలో దూరి కూర్చున్నా సరే, ఈ జనాభా లెక్కల గణకుడు నిన్ను వదలిపెట్టడు. వాగులో ఉన్నాసరే వంకలో ఉన్నాసరే, డొంకలో ఉన్నాసరే, దొరువులో ఉన్నాసరే, పొదలో ఉన్నాసరే, పుంతలో ఉన్నాసరే నువ్వు రావల్సిందే. వచ్చి తీరవలసిందే!' అని నేను నా మహా సంకల్పాన్ని మనసులో మననం చేసుకుంటూ ఉండగా, వెనుకవైపున ఆడుగుల చప్పుడు వినిపించింది. తిరిగి చూశాను.

"ఎవరు సామీ తమరు? నాకోసర మొస్తిరి?" అంటున్నాడతను.

డెబ్బైయేళ్ళుండొచ్చు. నల్లగా, సన్నగా, కాయవాటు శరీరం. మూకుడు బోర్లించినట్టు పొట్టిగా కత్తిరించిన తల వెంట్రుకలు. నెరసిన కనుబొమలు, చిన్న కళ్ళు, మెడలో వెండి కంటె. జెట్టీవాడిలా పంచ పైకెగగట్టి గోచీ పెట్టుకున్నాడు. మెడపై పెద్ద దుప్పటి, చొక్కా లేదు, చేత దుడ్డు గర్ర, అవును, అతడే మల్లేసు. అడివిలో జీవించే ఆవుల మల్లేసు.

"అవునయ్యా మల్లేసూ! నీ కోసమే రావడం. పదేండ్ల కొకసారి గవర్నమెంటు జనాభా లెక్కలు తీయిస్తుంది. మనిషన్నవాడెవడైనా సరే, వాడి పేరు జనాభా లెక్కల్లో ఉండి తీరవలసిందే. లేకపోతే వాడుండి లేనట్టే లెక్క. నీతో బాటు నీ కుటుంబంలో ఉన్న వాళ్ళ వివరాలు గూడా కావాలి. కడుపులో ఉన్న బిడ్డడు మాత్రమే మినహాయింపు. అప్పుడు పుట్టిన బిడ్డనైనా వదలి పెట్టగూడదు. తెలిసింది గదూ? ఇక నువ్వు నేనడిగే ప్రశ్నల కన్నిటికి జవాబు చెబుతూ రావాలి..."

చుబుకాన్ని మోకాళ్ళపైన ఆనించి, చేతుల్ని కాళ్ళ కడ్డంగా చుట్టుకుని, ముద్దలా బండపైన కూచున్నాడు మల్లేసు. చాలా విడ్డూరమైన విషయాన్ని వింటున్నట్టుగా అతడి ముఖ కవళికలు విస్మయ భావాన్ని వెలిబుచ్చుతున్నాయి. అయోమయంగా నా వైపు గుడ్లప్పగించి చూడసాగాడు.

మల్లేసు భార్య పదేండ్ల నాడు కళ్ళు మూసింది. ముగ్గురు కొడుకులు, కోడళ్ళు, వాళ్ళ బిడ్డలు - కుటుంబ సభ్యులు మొత్తం పదిహేను మంది. ఇంత మందివీ వివరాలు రాబట్టడానికి నేను మల్లేసుతో జరిపిన ఇంటర్వ్యూ సుదీర్ఘంగానే కొనసాగింది. ఆ వివరాల చిట్టానంతా సెన్సస్ రికార్డుల కోసం కేటాయిస్తే, మల్లేసు జీవిత వృత్తాంతాన్ని ఇలా సంగ్రహించవచ్చు:

మల్లేసు తండ్రి పేరు వెంకటేసు. అతడిదిన్నీ ఇదే వృత్తి - పశువులు మేపడం. మల్లేసు జననంతో బాటు అతడి గతం, వర్తమానం, భవిష్యత్తు అంతా అడివే! కోడళ్ళు మధ్యాహ్నమయ్యేటప్పటికి గ్రామంలోకి వెళ్ళి రైతుల ఇళ్ళ నుంచి సంగటి, కూర, చారు మొదలైనవి తెచ్చుకుంటారు. ముప్పూటలా అదే ఆహారం. కొడుకులు ఫలమైన ఆవుల్ని గర్భోత్పత్తి కోసం ఊళ్ళల్లోకి తోలుకెళ్ళి మళ్ళీ అడివిలోకి తోలుకొస్తారు. ఈనడానికి కొద్ది రోజులు ముందుగా సూడి ఆవుల్ని స్వంత కాపుల ఇళ్ళకు తోలిపెడతారు. పాలు వట్టిపోగానే మళ్ళీ అడవిలోకి తోలి తెచ్చుకుంటారు. గ్రామంలోకి వెళ్ళిన వాళ్ళు వెళ్ళగా, మిగిలిన వాళ్ళు ఎత్తయిన గుండ్ల పైన కూచుని చెల్లాచెదరుగా అడవిలో మేస్తున్న గొడ్లను కనిపెట్టి ఉంటారు. సాయంకాలం అన్నీ దొడ్డిలోకి చేరుకున్నదీ, లేనిదీ చూచుకుంటారు. రాత్రుల్లో మల్లేసు నెగడు కల్లంత దూరంలో నులకమంచం పైన పడుకుంటాడు. దగ్గర్లో ఎక్కడైనా అడివి మెకాల పొలకువ వినిపిస్తే నెగడులోకి కట్టె లెగదోసి, మంట పెద్దది జేసి, దబడబా ఓ డబ్బా రాకును మోగిస్తాడు. గుడిసెల్లో పడుకున్న ఆడ మగ, పిల్ల జెల్ల అందరూ లేచి వచ్చి "హాప్ హూప్" అంటూ బిగ్గరగా కేకలు పెడతారు. మెకాలు దూరంగా వెళ్ళిపోయినట్టు నమ్మకం కలిగితే అప్పుడిక మళ్ళీ నిద్ర కుపక్రమిస్తారు.

ఆశ్చర్యమేమిటంటే - మల్లేసుకు వృత్తిలో సైతం పోటి ఏర్పడి ఉండేదేనట కానీ తరతరాలుగా మల్లేసు పూర్వీకులకు పశు వైద్యంలో ఎంతో కొంత నైపుణ్యం ఉన్నందువల్ల గ్రామస్థులీ కొలువు నుంచీ వాళ్ళని తప్పించలేక పోతన్నారట. అంతా నాటు వైద్యమే. ఏవో వేర్లు, ఆకులు పట్టుకొచ్చి బండల పైనే తయారుచేసుకున్న కల్వాల్లో నూరి, ఆ వసరును వెదురుగొట్టాల్లో పట్టిపోస్తే ఎలాంటి జబ్బులైనా నివారణైపోతాయట. ఇన్ని పనులూ చేసినందుకుగాను, తిండితో బాటు కొంత డబ్బు కూడా ముడుతుంది. మల్లేసు చిన్నతనంలో జీవానికి అర్ధరూపాయి చొప్పున ఉండిన ఈ రేటు ఈ నాటికి పది రూపాయలదాకా పెరిగిందట. ఈ విధంగా సాలీనా ముట్టే రెండు వేలా పైచిలుకు రొఖ్ఖం బట్టలు కొనుక్కోడానికి బొటాబొటీగా సరిపోతుందన్నాడు మల్లేసు.

"బాగానే ఉంది, మల్లేసూ! తేనె తీసిన వాడు చెయ్యి నాక్కోడా అంటూ ఓ సామెత ఉంది. మరైతే నువ్విన్ని ఆవుల్ని సంరక్షిస్తున్నావు గదా! పాలు, పెరుగు, మజ్జిగ లాంటివి నీ దాకా వస్తున్నాయా?" అని ఆడిగాను.

"ఎట్లా వొస్తాయి సామీ? పాలిచ్చే ఆవులుండేది వూళ్లోనే గదా"! అన్నాడు మల్లేసు. ఆ స్టేట్‌మెంటులో ఆరోపణగానీ, అసంతృప్తిగానీ ధ్వనించలేదు.

"పోనీలే మల్లేసూ! మరొక విషయం తెలుసుకోవాలని ఉంది. ఈ అడివి దాటి బయటికి వెళ్ళే అవసరం నీ కెప్పుడూ కలగలేదా?" అని అడిగాను.

"పోకపోతే ఎట్ల? ఇద్దరు కూతుల్లుండి పోయిరి గద! వాల్లని చూసేదాని కన్నా ఎల్లాల్నా, పనిలేదా? పెద్దపిల్ల వుండేది నడిగడ్డ. చిన్నపిల్ల నిచ్చింది మాసంద్రం. నడిచి వెల్లేంత దూరమే సామీ! తెల్లారు జామున్న లేస్తే నాలుగు బారల పొద్దెక్కేటప్పటికి నడిగెడ్డలో వుండొచ్చు. అక్కడ్నించి వక్క కొరికేటంత సేపు నడిస్తే - మాసంద్రం!"

"మంచివాడివేలే మల్లేసూ! కూతుళ్ళ నిచ్చిన ఊళ్ళకైనా నడిచే వెళ్తావన్న మాట! మరింక బస్సెక్కే దెప్పుడు?" అన్నాను.

"ఎవ్వురైనా ఊరికే ఎక్కతారా సామీ! పనిబడాల గదా?"

"పోనీ, రైలు?"

"రైలు నేమో చూడాలనుంది. ఏం చేసేది? రైలుమార్గం దగ్గరలో లేక పోయిందే!"

నిజమే, వనస్థలం ఉనికి అలాంటిది. అతి సమీపంలో ఉన్న రైలు స్టేషను కైనా రెండు గంటల బస్సు ప్రయాణం.

మల్లేసు బస్సును చూచాడే గానీ ఎక్కలేదు. రైలునైతే అసలు చూడనే లేదు. చదువు రాదు. లోకజ్ఞానం లేదు. వేషం, భాష, నివాసం, భోజనం మొదలైన వాటినిబట్టి చూస్తే శిలాయుగం నుంచీ అతడెంతో దూరం ముందుకు సాగివచ్చినట్టులేదు. కానీ ఇందులో అతడి బాధ్యత ఏముంది? నాగరికత ఆ మాత్రంగా మాత్రమే అతణ్ణి కరుణించిందని చెప్పుకోవాలి. ఆ మాట కొస్తే లక్షోపలక్షల మంది ఏ సుఖానికీ నోచుకోక, ఏ సదుపాయానికీ పాత్రులు గాక, మల్లేసుకన్నా హీనంగానో, లేకుంటే మరికొంచెం మెరుగ్గానో బ్రతుకుతున్నారన్న విషయం మనకు తెలుసు. ప్రభుత్వం ఎంతో ఉదార భావంతో తిండికి ఠికాణా లేని, తల దాచుకోడానికి చోటులేని బికారుల్ని, బైరాగుల్ని, బిచ్చగాళ్ళనీ గూడా సెన్సస్ రికార్డుల్లోకి తీసుకురావడానికి తన తంటాలేవో తాను పడుతూ ఉంది. కానీ ఎంతగా జాగ్రత్తపడినా, వలల ఆల్లికలో నుంచీ జారిపోయే చిరుచేపల్లా కొందరు జనాభా గణనలోకి రాకుండా తప్పిపోతున్నారు.

అయితే ఒకటి. తండ్రులు, తాతలు సంపాదించిపోతే తిని తీరిగ్గా కూర్చుని గోళ్ళు గిల్లుకునే సోమరిపోతులకు, అవినీతితోను, అక్రమ పద్ధతులతోను బొజ్జలు నింపుకుని కండలు పెంచుకునే స్వార్థపరులకు; ఎట్లాగైనా పని ఎగ్గొట్టి దండుగ జీతాలు పుచ్చుకునే ఉద్యోగులకు సైతం జనాభా పట్టికలో స్థానం ఉన్నప్పుడు ఒళ్లు దాచుకోకుండా ఎంతో శ్రద్ధగా భయభక్తులతో తమ పని తాము చేసుకుపోయే మల్లేసు లాంటి వాళ్ళకు అందులో చోటుండకపోవడం అన్యాయం! సామాజిక శాస్త్రరీత్యా చూచినప్పుడు మల్లేసు అనాగరికుడే అవుగాక! సంఘం కోసం జీవించే వాళ్ళనీ, సంఘాన్ని జలగల్లా పీల్చి పిప్పిజేసేవాళ్ళనీ జలభాను రెండు తరగతులుగా విభజిస్తే మొదటి తరగతిలో మొదటి గ్రేడు క్రిందికి వచ్చే వాడు మల్లేసు. భూమిపైన పుట్టి పెరిగినందుకు మనిషి చేయదగిన మంచి పనులు కొన్ని ఉంటాయి. నేను నా జీవితంలో చేసిన ఒక మంచి పని - మల్లేసు పేరును జనాభా లెక్కల్లోకి ఎక్కించడం!

♦ ఆంధ్రప్రభ వారపత్రిక - 1991 ♦